క్లుప్తంగా

భౌతికదాడి బాధాకరం


అల్లి రాజబాబు

బోట్‌క్లబ్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ సీపీ నాయకులపై భౌతిక దాడులు పెరిగాయని వైఎస్సార్ సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు అల్లి రాజబాబు ఆదివారం ఓ ప్రకటనలో వాపోయారు. కృష్ణా జిల్లా జెడ్పీ చైర్మన్ ఉప్పాల హారికపై కూటమి నాయకుల దాడిని తీవ్రంగా ఖండించారు. గుడివాడలో జరుగుతున్న బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమానికి హాజరవుతున్న హారికపై టీడీపీ గుండాలు రాళ్లు, కర్రలతో దాడిచేసి బూతులు తిట్టడం దారుణమన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలనకు ఇది నిదర్శనమన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో బీసీ మహిళలకు పెద్దపీట వేశారన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్లుగా, మున్సిపల్ చైర్మన్లుగా, కార్పొరేషన్ మేయర్లుగా మహిళలను నియమించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీ మహిళలు చైర్మన్లుగా ఉన్నచోట అవిశ్వాసాలు పెట్టివారిని భయభ్రాంతులకు గురిచేస్తూ, రాజీనామాలు చేయిస్తున్నారన్నారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బాధ్యత వహించాలన్నారు. హారికపై దాడి చేసిన కిరాయి గుండాలను అరెస్ట్ చేసే వరకూ ఉద్యమం చేస్తామన్నారు.

ఉప సర్పంచ్ శ్రీనివాస అప్పారావు మృతి


అప్పారావు (ఫైల్)

కరప: పెద్దాపురప్పాడు గ్రామ సర్పంచ్ బిరుదా సరస్వతి భర్త ఉప సర్పంచ్ శ్రీనివాస అప్పారావు (60) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆదివారం ఇంటి వద్దే మృతి చెందారు. ఆయనకు భార్య సరస్వతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మాజీ సర్పంచ్ గొల్లపల్లి ప్రసాదరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బొండా చంటిబాబు, గ్రామ ఇన్‌చార్జి కార్యదర్శి పి.వీరభద్రరావు తదితరులు శ్రీనివాస అప్పారావు భౌతిక కాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, ఎంపీడీఓ ఎం.అనుపమ తదితరులు సంతాపం తెలిపారు.

సేవలు అభినందనీయం


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న లోకల్ బిజినెస్ నెట్‌వర్క్ సభ్యులు

బోట్‌క్లబ్: యువత వారి వ్యాపార అభివృద్ధికి లోకల్ బిజినెస్ నెట్‌వర్క్ స్థాపించి ఏటా సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ బాదం బాలకృష్ణ అన్నారు. స్థానిక టౌన్ హాల్‌లో ఆదివారం బిజినెట్ నెట్‌వర్క్ సభ్యులు ఇండియన్ రెడ్‌క్రాస్ సహాయంతో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. బాదం బాలకృష్ణ మాట్లాడుతూ ఒకరి రక్తదానం నలుగురికి ప్రాణదానంతో సమానమన్నారు. రక్తదాతలు ఎలాంటి అపోహలకు పోకుండా ప్రతి మూడు నెలలుకు ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. లోకల్ బిజినెస్ నెట్‌వర్క్ అధ్యక్షుడు రవితేజ, ఉపాధ్యక్షుడు సిరాజ్, సెక్రటరీ ఏవీవీ సతీష్‌కుమార్‌లు రక్తదానం చేసి ఇతర సభ్యులకు స్ఫూర్తిగా నిలిచారు. అనంతరం 50 మంది సభ్యులు రక్తదానం చేశారు. లయన్స్ క్లబ్ వైస్ గవర్నర్ చిట్నీడి శ్రీనివాస్, రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు పాల్గొన్నారు.

20న యంగ్ మైండ్ వార్షికోత్సవం

బాలాజీచెరువు: ఈ నెల 20న స్థానిక దంటు కళా క్షేత్రంలో యంగ్ మైండ్ స్వచ్ఛంద సంస్థ ప్రథమ వార్షికోత్సవం నిర్వహిస్తామని సంస్థ అధ్యక్షుడు వాకడ వెంకటరమణ (చిన్న) ఆదివారం తెలిపారు. ఆ రోజు దేశ సైనికులు, అన్నదాతలు, నర్సులు, పారిశుధ్య కార్మికులు, అనాథలు, విభిన్న ప్రతిభావంతులు, సమాజ సేవకులు, కళాకారులు, జర్నలిస్టులు, ఆదర్శ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


పిఠాపురం – ఉప్పాడ రోడ్డులో వాకతిప్ప వద్ద ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

కొత్తపల్లి: పిఠాపురం – ఉప్పాడ రోడ్డులో వాకతిప్ప రామాలయం వద్ద పైపులైన్ కోసం తవ్విన గొయ్యి ప్రమాదకరంగా మారింది. ఒకవైపు పైపులైన్ గొయ్యి, మరోవైపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

ఆరనీకుమా ఈ దీపం

- నగరంలో వెలగని వీధి దీపాలు
- పలు ప్రాంతాల్లో అంధకారం
- చీకటి పడితే భయం భయం

బోట్‌క్లబ్: స్మార్ట్ సిటీ.. జిల్లా కేంద్రం.. ఈ మాటలు విని ఇక్కడేదో గొప్పగా ఉంటుందని భావించే వారికి చీకటే కనిపిస్తోంది. కాకినాడ కార్పొరేషన్ స్థాయికి ఎదిగినా చాలా ప్రాంతాల్లో ఇప్పటికీ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయలేదు. మరికొన్ని చోట్ల ఉన్నా అవి వెలగవు. చాలాచోట్ల హైమాస్ట్ లైట్లున్నా అవి పాడవడంతో అంధకారం అలముకుంటుంది. చీకటి పడితే చాలు అటుగా వెళ్లాలంటే ప్రజలు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. తమ ప్రాంతంలో విద్యుత్ దీపాలు వెలగడం లేదని అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. బల్బులు కొనుగోలు చేసేందుకు కార్పొరేషన్‌లో డబ్బులు లేవని చెప్పడం విడ్డూరంగా ఉందని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ దీపాల నిర్వహణ మరింత అధ్వానంగా తయారైంది. ప్రస్తుతం కాకినాడ నగరంలో 36కు పైగా బ్రాందీ షాపులు ఉన్నాయి. ప్రభుత్వం వాటికి పర్మిట్ రూమ్‌లు కూడా మంజూరు చేయడంతో ప్రస్తుతం చీకటి పడితే ఆయా బ్రాందీ షాపుల వద్ద గుంపులు గుంపులుగా మద్యం తాగి రోడ్డుపై వెళ్లే వారిని మందుబాబులు అటకాయిస్తున్నారు. దీంతో అటు వైపు వెళ్లాలంటే మహిళలు భయపడాల్సిన పరిస్థితి ఉంది. పూటుగా మద్యం తాగి కొందరు ప్రవర్తిస్తున్న తీరు చాలా దారుణంగా ఉండటంతో ప్రజలు చీకటి పడితే ఇంటికే పరిమితం అవుతున్నారు. ఏటా రూ.కోట్లు వస్తున్నా కాకినాడ కార్పొరేషన్ అధికారులు మాత్రం వీధి దీపాల నిర్వహణపై దృష్టి పెట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. కార్పొరేషన్‌కు పాలకవర్గం లేక అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు సైతం ఉన్నాయి. విద్యుత్ దీపాల మరమ్మతులు చేయకపోవడంతో గతంలో కౌన్సిల్ సమావేశాల్లో పలుమార్లు కౌన్సిల్ సభ్యులు అధికారులను నిలదీసిన సందర్భాలు ఉన్నాయి. కౌన్సిల్ పదవీకాలం ముగిసి రెండేళ్లు గడుస్తున్నా ఎన్నికలు లేక అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కనీసం పాడైన విద్యుత్ దీపాలనూ మార్చకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

ఎక్కడెక్కడ అంటే..

స్థానిక టూటౌన్ ఓవర్ బ్రిడ్జి దిగువ నుంచి టౌన్ రైల్వే స్టేషన్ జవహర్ వీధి మీదుగా మెయిన్ రోడ్డును ఆనుకుని ఉన్న సూర్యారావుపేట, సాలిపేట ప్రాంతాల్లో గంజాంవారి వీధి శివారు వరకూ ఉన్న వీధి విద్యుత్ దీపాల్లో 57 స్తంభాలకు లైట్లు వెలగడం లేదు. బాలాజీచెరువు సెంటర్ హైమాస్ట్ లైటింగ్‌లో రెండు దీపాలు వెలగడం వెలగడం లేదు. బ్రిడ్జిపై దీపాలు వెలగక బ్రిడ్జి దిగువ రెండు వైపులా ఉన్న మార్గాల్లో చీకటి అలముకుంది. స్థానిక పైడావారి వీధిలో వీధి దీపాలు పనిచేయకపోవడంతో ఆ ప్రాంతంలో ప్రజలు భయం భయంగా ప్రయాణిస్తున్నారు. వేరే ప్రాంతాలకు వెళ్లి చీకటి పడిన తర్వాత మహిళలు బస్సు, ఆటో దిగి తమ ఇంటికి వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉందంటే ఇక్కడ ఎంత చీకటి ఉందో వేరే చెప్పాల్సిన అవసరం లేదు.

ఎల్‌బీనగర్ రోడ్డులో..

ఎల్‌బీనగర్ రోడ్డులోని పలు వీధి దీపాలు పాడయ్యాయి. ఇక్కడ కొత్తగా మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతోపాటు పర్మిట్ రూమ్‌లు కూడా మంజూరు చేశారు. ఇక్కడ మద్యం బాబులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కొండయ్యపాలెం బ్రిడ్జిపై నుంచి వచ్చే ప్రయాణికులతో ఈ రోడ్డు ఎప్పుడూ బిజీగా ఉంటుంది. పలు దీపాలు వెలగక, బ్రాందీ షాపు కారణంగా ఇటుగా వెళ్లేందుకు మహిళలు భయపడుతున్నారు. ఇప్పటికైనా నగరంలో వీధి దీపాల వ్యవస్థను మెరుగుపర్చాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


శ్రీరామ్‌నగర్‌లో వెలగని వీధి దీపం


మధురానగర్‌లోనూ అదే పరిస్థితి

నెలల తరబడి వెలగకపోయినా..



నగరంలోని కొన్ని ప్రాంతాల్లో తరచూ వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో చీకటి పడితే నడిచి వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి వచ్చింది. వీధి దీపాలు నెలల తరబడి వెలగకపోయినా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించాలి.

– బొద్దపాటి వెంకటగౌతమి

మద్యం షాపులతో ఇబ్బంది



బ్రాందీ షాపులు ఉన్న ప్రాంతాల్లో కూడా విద్యుత్ దీపాలు వెలగని కారణంగా ఈ రహదారిలో ఒంటరిగా వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. దీపాలు వెలగకపోవడం, మందుబాబులు గుంపులుగా రోడ్డు చివర గలాట సృష్టించడంతో ఇబ్బందిగా మారింది.

– సిరెడ్డి రమ్య

17 నుంచి సిల్వర్ జూబ్లీ


స్మారక కళాపరిషత్ సిల్వర్ జూబ్లీ వేడుకల ఆహ్వాన పత్రాలను ఆవిష్కరిస్తున్న పరిషత్ సభ్యులు

బోట్‌క్లబ్: స్థానిక సూర్యకళా మందిరంలో అల్లూరి సీతారామరాజు స్మారక కళాపరిషత్ సిల్వర్ జూబ్లీ వేడుకలను ఈ నెల 17, 18, 19, 20 తేదీల్లో నిర్వహించనున్నట్లు సంస్థ గౌరవ అధ్యక్షుడు కర్రి భావిరెడ్డి, అధ్యక్షుడు కర్రి అచ్యుతరామారెడ్డి తెలిపారు. ఇక్కడి దంటు కళా క్షేత్రంలో అల్లూరి సీతారామరాజు స్మారక కళాపరిషత్ సిల్వర్ జూబ్లీ వేడుకల సన్నాహక సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకల ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. పరిషత్ ప్రధాన కార్యదర్శి పంపన దయానందబాబు మాట్లాడుతూ ఈ వేడుకలను విజయవంతం చేసేందుకు ప్రతి రోజూ రెండు లక్కీడిప్‌లు నిర్వహించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయి నాటక పోటీలు నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. 750కి పైగా సినిమాల్లో నటించిన సినీ నటుడు కోటా శ్రీనివాసరావు మృతి సినీ, నాటక రంగానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షుడు ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, ఎస్‌వీ బాపిరాజు, ట్రెజరర్ నూకరాజు, టీవీఎస్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే వారికే పదవులు

బోట్‌క్లబ్: బీజేపీలో కష్టపడే వారికే పదవులు వస్తాయని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. బీజేపీ కాకినాడ సెంట్రల్ మండల అధ్యక్షులుగా ఎన్నికైన గోడి సత్యవతి ఆదివారం బిక్కినను సత్కరించారు. మాజీ కౌన్సిలర్ జీవీవీ శర్మ, నాయకులు గోడి వెంకట్, తాతోలు నాగభూషణం పాల్గొన్నారు.

బాబోయ్ ఎండ..


ఎండకు నిర్మానుష్యంగా కరప మెయిన్ రోడ్డు

కరప: భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. వేసవిని తలపిస్తున్నాడు. దీనితో సగటు జీవి అల్లాడుతున్నాడు. దీనికితోడు వడగాడ్పులను భరించలేకపోతున్నాడు. కరప మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఎండ మండించింది. వృద్ధులు, పిల్లలు, మహిళలు ఇబ్బంది పడ్డారు. రోహిణీ కార్తెలో వాతావరణం అంతగా వేడిగా లేకపోవడంతో హమ్మయ్య అనుకున్నామని, పునర్వసు కార్తెలో వర్షాలు పడతాయనుకుంటే, వేసవిని మించిన ఎండలు దంచికొడుతున్నాయని ప్రజలు అంటున్నారు. ఈ కార్తెలో నైరుతి రుతు పవనాలు వస్తాయనుకుంటే, అవి కాస్త మొండికేయడంతో వేసవికాలం కొనసాగుతోందని వృద్ధులు వాపోతున్నారు. ఆషాఢ మాసంలో అయినా వర్షపు జల్లులు పడతాయనుకుంటే నిరాశే ఎదురవుతోందని, ఒక రోజుకు మించి మరోరోజు ఉష్ణోగ్రతలు 38 నుంచి 40 డిగ్రీలు ఉంటున్నాయని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం పగటి ఉష్ణోగ్రత 40 డిగ్రీలు నమోదు కావడంతో ప్రజలు ఆపసోపాలు పడ్డారు. ఆరు రోజుల క్రితం ఆకాశం మబ్బుపట్టి కొద్దిపాటి వర్షం పడటంతో వేసవితాపం నుంచి ఉపశమనం పొందారు. ఒకపక్క కాలువలకు నీరొదిలారని, నైరుతి రుతుపవనాలు కూడా వచ్చేశాయని ప్రజలు సంతోష పడ్డారు. మళ్లీ ఒక్కసారిగా ఎండ విజృంభించడంతో భయాందోళన చెందుతున్నారు. ఉదయం 7.30 గంటల నుంచే ఎండ తీవ్రంగా ఉండటంతో ప్రజలు బయటకు రావడానికే భయపడుతున్నారు. రాత్రి ఏడు గంటలకు కూడా వేడిగా ఉండడంతో తట్టుకోలేకపోతున్నామని వృద్ధులు, మహిళలు అంటున్నారు. ఎండ తీవ్రతకు సార్వా నారుమడులు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. పూర్తి స్థాయిలో వర్షాలు పడేవరకూ ఎండ తీవ్రత తగ్గదని ప్రజలు అంటున్నారు.


కరప నుంచి కాకినాడ వెళ్లే రహదారిలో..

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ


బోట్‌క్లబ్ ఉద్యానంలో మొక్కలు నాటుతున్న డాక్టర్ రాఘవేంద్రరావు తదితరులు

కాకినాడ రూరల్: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యవుతుందని రాష్ట్ర మెడికల్ ఎడ్యుకేషన్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రాఘవేంద్రరావు అన్నారు. స్థానిక బోట్ క్లబ్ ఉద్యానంలో వన్ స్టెప్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. రాఘవేంద్రరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు మొక్కలు నాటాలని, తద్వారా భావితరాలకు ఆక్సిజన్ కొరత ఉండదన్నారు. వన్ స్టెప్స్ సొసైటీ అధ్యక్షుడు జోగా రామకృష్ణ మాట్లాడుతూ కాకినాడ నగరాన్ని గ్రీనరీగా చేయడం కోసం ఇప్పటికి తాము 20 వేల మొక్కలు నాటామన్నారు. కార్యక్రమం సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంకండి

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పోలీసు శాఖ విశ్రాంత ఉద్యోగి దొంగరామ సత్యానారాయణ అన్నారు. రమణయ్యపేటలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలు తీసుకుని వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. తమ బిడ్డలను కోల్పోయి చాలామంది తల్లిదండ్రులు శోకం అనుభవిస్తున్నారన్నారు. మత్తు పదార్థాలు ఎవరైనా విక్రయిస్తే 1972కు సమాచారం అందిస్తే పోలీసులు చర్యలు తీసుకుంటారన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు తిప్పికొడతాం..

- ఈ నెల 16న జిల్లా మహాసభ
- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మధు


సీపీఐ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మధు

సామర్లకోట: సీపీఐ మహాసభలను ఈ నెల 15, 16 తేదీల్లో సామర్లకోటలో నిర్వహిస్తామని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు అన్నారు. స్థానిక విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో పట్టణ కార్యదర్శి పెదిరెడ్ల సత్యనారాయణ అధ్యక్షతన ఆదివారం జరిగిన నియోజకవర్గ విస్తృత సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ ప్రాంతం కమ్యూనిస్టు పార్టీకి కంచుకోటగా గుర్తింపు పొందడం వల్ల ఈ మహాసభలు నిర్వహించాలని నిర్ణయించామని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయని విధానంపై, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు పలు తీర్మానాలు చేస్తామని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలు ఏడాది గడిచినా అమలు చేయకపోవడంపై ఉద్యమ కార్యచరణ చేస్తామన్నారు. అదే విధంగా ప్రజలకు తీరని అన్యాయం జరిగే స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేస్తామని తెలిపారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న సమయంలో స్మార్ట్ మీటర్లను చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్‌లు వ్యతిరేకించగా.. నేడు వాటిని అమలు చేస్తున్నారన్నారు. ప్రజలకు విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం దీక్షలు చేసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఇప్పుడు ఆ మాట పక్కనపెట్టడం దారుణమని వివరించారు. వ్యవసాయ కార్మికుల వేతనాల పెంపు, సమాన పనికి సమాన వేతనం వంటి అంశాలపై తీర్మానాలు చేస్తామని చెప్పారు. ఈ మహాసభలను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.ప్రభాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పి.దుర్గలు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బొడకొండ, అడపా చిట్టిబాబు, పెదిరెడ్ల సత్యనారాయణ, మడగల రమణ, పెదిరెడ్ల అర్జునరావు, సప్పా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు


రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పిఠాపురం సీఐ శ్రీనివాస్

పిఠాపురం: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ హెచ్చరించారు. ఆదివారం పిఠాపురం పట్టణ పోలీస్ స్టేషన్లో రౌడీ షీటర్లకు, వివిధ కేసుల్లో నిందితులకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షణికావేశంలో నేరం చేసిన వారు తరువాత మారుతుంటారని, కానీ కొందరు నేరాలకు అలవాటు పడి అదే వృత్తిగా కొనసాగిస్తుంటారన్నారు. అలాంటి వారు మారకపోతే జీవితాంతం జైలు పాలయ్యే అవకాశాలు ఉంటాయన్నారు. రౌడీషీటర్ల ప్రవర్తనలో మార్పు రావాలన్నారు. ఎటువంటి నేరాలకు పాల్పకుండా సత్ప్రవర్తన కలిగి ఉంటే రౌడీషీట్లు తొలగించే అవకాశం ఉంటుందన్నారు. ఎవరైనా ఏదైనా గొడవలు, కేసుల్లో ప్రత్యేక్షంగా పాల్గొంటే వారి బెయిల్ రద్దు చేయించి తిరిగి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పిఠాపురం పట్టణ, రూరల్, గొల్లప్రోలు, కొత్తపల్లి ఎస్సైలు మణికుమార్, జాన్‌బాషా, ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

కొత్తపల్లి: మద్యం తాగి వాహనాలు నడిపితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఎస్సై వెంకటేష్ హెచ్చరించారు. ఉప్పాడ – కాకినాడ బీచ్ రోడ్డులో వాహనచోదకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలు వద్ద మద్యం, ధూమపానం, గుట్కా వంటివి విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెరువులో చేపల మృత్యువాత

- కొందరి నిర్వాకంతో అవస్థలు
- అధికారులు పట్టించుకోక ఇబ్బందులు


మంచినీటి చెరువు చుట్టూ గడ్డి మందు పిచికారీ చేయడంతో ఎండిపోయిన పిచ్చిమొక్కలు

కరప: స్థానిక సామూహిక రక్షిత మంచినీటి చెరువులోని చేపలు చనిపోతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోకపోవడంపై గ్రామస్తుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామంలోని సామూహిక రక్షిత మంచినీటి చెరువు కరప, పరిసర 8 గ్రామాలకు రక్షిత మంచినీటిని అందిస్తోంది. సమీపంలోని పెనుగుదురులోని కేఎంజీ కెనాల్(పంట కాలువ) నుంచి పైపులైన్ ద్వారా మోటార్లతో తోడి మంచినీటి చెరువును నింపుతారు. అక్కడి నుంచి క్లోరినేషన్ చేసిన తర్వాత కరప పరిసర గ్రామాలకు పైపులైన్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తారు. ఇదే మంచినీటి చెరువు చుట్టూ 2023లో మాజీ మంత్రి కురసాల కన్నబాబు గ్రామస్తుల వినతి మేరకు వాకింగ్ ట్రాక్ నిర్మించారు. ప్రతి ఏటా మంచినీటి చెరువులోని చేపలను పట్టుబడి చేసి, అమ్మకాలు జరిపేందుకు జిల్లా పరిషత్ అధికారులు బహిరంగ వేలాన్ని పంట కాలువలకు నీరు వదిలే సమయానికి జరిపి, తర్వాత చెరువును నింపి, తాగునీటిని సరఫరా చేస్తారు. ఈ ఏడాది పంట కాలువలకు నీరు వదిలి నెల రోజులు కావస్తున్నా మంచినీటి చెరువులోని చేపలు పట్టడానికి వేలం పాట నిర్వహించలేదు. ఇదిలా ఉంటే మంచినీటి చెరువు చుట్టూ ఉండే వాకింగ్ ట్రాక్‌లో పిచ్చిమొక్కలు, గడ్డి అడవిలా పెరిగిపోయింది. ఈ గడ్డిని ఉపాధి హామీ పథకం ద్వారా వేతనదారులకు పని కల్పించి తొలగించాల్సి ఉంది. అయితే నిబంధనలకు విరుద్ధంగా మంచినీటి చెరువు చుట్టూ ఉండే పిచ్చిమొక్కలు, గడ్డిని తొలగించకుండా, స్థానిక కూటమి నేతలు ఎవరినీ సంప్రదించకుండా గడ్డి మందును 5 రోజుల క్రితం పిచికారీ చేయించారు. ఆ మందుకు పిచ్చిమొక్కలు ఎండిపోయాయి. గడ్డిమందు విష ప్రభావంతో పాటు, చెరువులోని నీరు అడుగంటి ఉండడం, వేసవిని మించిన ఎండలకు నీరు, అడుగున ఉండే మట్టి వేడెక్కడంతో చెరువులోని చేపలు చనిపోయి పైకి తేలిపోయాయి. చెరువులో చేపలు చనిపోయాక, వేలంపాట నిర్వహించినా పాడడానికి ఎవరు వస్తారని గ్రామస్తులు అంటున్నారు. కరపలో మంచినీటి చెరువులోని చేపలు చనిపోవడంపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


కరప మంచినీటి చెరువులో చనిపోయి తేలుతున్న చేపలు

బస్ స్టాప్ ఏదీ...?


పిఠాపురం పాదగయ క్షేత్రం వద్ద నిరుపయోగంగా బస్ స్టాప్

పిఠాపురం: అది బస్టాప్ అయినా అక్కడ బస్సులు ఆగవు. ప్రయాణికుల ఇబ్బందులు అధికారులకు పట్టవు. పిఠాపురం బైపాస్ రోడ్డులో పాదగయ క్షేత్రం వద్ద ఇటీవల బస్ స్టాప్ నిర్మించారు. అక్కడ బస్సులు ఆగకపోవడంతో ప్రయాణికులు మండుటెండలో నిలువ నీడ లేనిచోట నిల్చుని బస్సులు ఎక్కాల్సి వస్తుంది. దీంతో ఆ బస్ స్టాప్ నిరుపయోగంగా మారింది. నిర్మించిన నేతలు, అధికారులు పట్టించుకోక పోవడంతో అది ఇప్పుడు ఒక పార్టీ జెండాలు మోసే షెడ్డుగా మిగిలింది.


మండుటెండలో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు